# ఆర్థిక వైద్యులు చార్టర్డ్ అకౌంటెంట్లు

## (01 జూలై "జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం" సందర్భంగా)

సాధారణంగా చార్టర్డ్ అకౌంటెంట్ల(సిఏ)ను "ఆర్థిక వైద్యులు" లేదా "ఫైనాన్సియల్ డాక్టర్స్" అని కూడా పిలుస్తారు. ప్రైవేట్ ప్రాక్టీస్ చేసినా లేదా బహుళ జాతి కంపెనీలో పని చేసినా చార్టర్డ్ అకౌంటెంట్లు తమ విధి నిర్వహణలో భాగంగా ఆయా సంస్థల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడతారు. 01 జూలై 1949 రోజున "ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఏఐ)" అనబడే రెండవ అతి పెద్ద అకౌంటింగ్ సంస్థ ఏర్పడిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 01 జూలై రోజున దేశవ్యాప్తంగా "జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ఐసిఏఐలో సభ్యులుగా ఉన్న భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్లను నియంత్రించడం, వారి యోగక్షేమాలు చూడడం, వారి రంగంలో వస్తున్న మార్పులను అవగాహన పర్చడం లాంటి ముఖ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. నేడు భారత దేశవ్యాప్తంగా 3.5 లక్షల 'సిఏ'లతో నిబద్ధతతో కొనసాగుతున్నది.

చార్టర్డ్ అకౌంటెంట్ల ప్రాధాన్యం:

నేడు 76వ జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం జరుగుపుకుంటున్న వేళ వ్యాపార/ప్రభుత్వ/ప్రభుత్వేతర సంస్థ ఆర్థిక పారదర్శకత, ఫైనాన్షియల్ రిపోర్టింగ్, ప్లానింగ్, ఇంటర్నల్ కంట్రోల్, కార్పొరేట్ గవర్నెన్స్, ఆదాయ పన్నుల సంస్కరణలు, కార్పొరేట్ ఆర్థిక లావాదేవీలు, ఆడిటింగ్, ఆర్థిక నిర్ణయాల్లో సలహాలు ఇవ్వడం, ఆర్థిక విశ్లేషణలు, రిస్క్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ చట్టాల అమలు, సరైన జమ ఖర్చులను చూపడం లాంటి పలు విధులను వృత్తి విలువలతో నిర్వహించడానికి వెన్నెముకగా 'సిఏ'లు నిలుస్తున్నారు. జాతీయ సిఏల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సిఏల సేవలను కొనియాడడం, దేశ ఆర్థిక ప్రగతిలో వారి పాత్రను సామాన్య జనాలకు అవగాహన పర్చడం, ఉత్తమ సిఏలను సన్మానించడం, యువతను సిఏ వృత్తి వైపుకు ఆకర్షించడం, ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను మెరుగుపరచడం, ఐసిఏఐ సంస్థ ప్రగతిని గుర్తించడం, సామాజిక మాద్యమాల్లో ప్రచారం చేయడం, సెమినార్లు లేదా వెబినార్లను నిర్వహించడం, సిఏలకు కృతజ్ఞతలు తెలుపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

2025 జాతీయ సిఏల దినోత్సవం ఇతివృత్తంగా "ఆర్థిక శ్రేష్ఠతను సాధించడం (ఎంపవరింగ్ ఫైనాన్షియల్ ఎక్సలెన్స్" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేటి డిజిటల్ ఏఐ యుగంలో సిఏలు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, ఏఐ టెక్నాలజీ వాడుకోవడం, బ్లాక్‌చైన్, డాటా అనాలిసిస్ వాడుకోవడం తప్పనిసరి కానుంది. ఇలాంటి అత్యాధునిక టెక్నాలజీని సిఏలకు పరిచయం చేయడానికి ఐసిఏఐ స్వచ్ఛందంగా చొరవ తీసుకుంటున్నది. అంకితభావం, వృత్తి నిబద్ధతను ప్రదర్శిస్తున్న సిఏలు దేశ ఆర్థిక వ్యవస్థలకు మూల స్థంభాలుగా నిలుస్తున్నాయి. 01 జూలైన మన చుట్టు ఉన్న సిఏలను కలిసి కృతజ్ఞతలు తెలియజేద్దాం, వారి శ్రమకు తగిన గుర్తింపును ఇద్దాం.

-డా॥ మధుసూదన్ రెడ్డి బుర్ర
9949700037

# పసుపు బోర్డు ఏర్పాటు చేసి నిజామాబాద్ రైతుల నాలుగు దశాబ్దాల డిమాండును నెరవేర్చిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జూన్ 30:కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నిజామాబాద్‌లో జరిగిన కిసాన్ మహా సమ్మేళన్‌లో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి, కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అంతకు ముందు, నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ నాయకుడు డి. శ్రీనివాస్ విగ్రహాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆవిష్కరించి, నివాళులు అర్పించారు.

జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని 2023లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారని తెలిపారు. అలాగే నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా పసుపు రైతుల నాలుగు దశాబ్దాల డిమాండును సైతం నెరవేర్చారని పేర్కొన్నారు. మోదీ తాను ఇచ్చిన వాగ్దానాలను ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటారని స్పష్టం చేశారు.

జాతీయ పసుపు బోర్డు ప్రారంభంతో నిజామాబాద్ పసుపు అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకుంటుందని శ్రీ అమిత్ షా అన్నారు. పసుపు ధరలు తరచూ తగ్గుతూ ఉంటాయని, కానీ దాని ధర ఎప్పటికీ తగ్గని రోజు వస్తుందని ఆయన చెప్పారు. పసుపు ఔషధ గుణాలను బోర్డు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తుందని తెలియజేశారు. పసుపు వాణిజ్యంలో నిజామాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మారుస్తుందని వివరించారు. అలాగే రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవోలు), రైతులకు సాధికారత కల్పిస్తుందని పేర్కొన్నారు.

నేషనల్ ఎక్స్‌పోర్ట్ కోపరేటివ్ లిమిటెడ్, నేషనల్ కోపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. ఈ రెండు జాతీయ సహకార సంస్థల శాఖలను నిజామాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పసుపు ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు సంబంధించిన సమగ్ర వ్యవస్థను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్గానిక్ పసుపునకు అమెరికా, యూరోపియన్ యూనియన్, కెనడా, యూకే, వియత్నాం, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో డిమాండు ఎక్కువగా ఉందని ఆయన వెల్లడించారు. ఈ దేశాలకు ఆర్గానిక్ పసుపు రైతులు పండించిన ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు ప్రయత్నాలు చేపడుతున్నామని తెలిపారు.

2014లో శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జాతీయ భద్రతను బలోపేతం చేయడం ప్రారంభించారని శ్రీ అమిత్ షా వెల్లడించారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు తరచూ దాడి చేసి, సునాయాసంగా తప్పించుకునేవారని గుర్తు చేసుకున్నారు. పదేళ్ల మోదీ ప్రభుత్వంలో మూడు సార్లు ప్రధాన ఉగ్రవాద దాడులు జరిగాయి: ఉరి, పుల్వామా, పహల్గాం. ఉరి ఉగ్రదాడి తర్వాత సర్జికల్ స్ట్రయిక్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం ఘటన అనంతరం పాకిస్థాన్లోని ఉగ్రవాద స్థావరాలను భారత భద్రతా దళాలు నాశనం చేశాయని ఆయన తెలియజేశారు. పహల్గాం దాడి తర్వాత వారికి గుణపాఠం నేర్పాలని ప్రధాని నిర్ణయం తీసుకున్నారు. పాకిస్థాన్ నుంచి అణుదాడుల బెదిరింపులు, ప్రతిపక్షాల నుంచి అనుమానాలు వెల్లువెత్తినప్పటికీ భారత బలగాలు ఒక్క రాత్రిలో పాకిస్థాన్‌లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయి. వందలాది ఉగ్రవాదులను హతమార్చాయి. ఈ అంశంలో ప్రతిపక్ష నేతలు ఇప్పటికీ ప్రశ్నలు లేవనెత్తుతున్నారని, పాకిస్థాన్ ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే వారికి సమాధానాలు దొరుకుతాయని శ్రీ షా అన్నారు. భారత్‌లో శాంతికి విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నవారి ప్రధాన స్థావరాలను ఆపరేషన్ సిందూర్ ద్వారా ధ్వంసం చేసి దేశభద్రతకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

దేశంలో గడచిన నాలుగు దశాబ్దాల్లో వామపక్ష అతివాద ప్రభావం ఉన్న జిల్లాల్లో 40,000 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా వెల్లడించారు. ఎంతో మంది గిరిజనులు తమ ప్రాణాలను లేదా అవయవాలను పోగొట్టుకున్నారని తెలిపారు. ఆయుధాలను విడిచిపెట్టి లొంగిపోవాలని, సాధారణ జనజీవన స్రవంతిలో చేరాలని నక్సలైట్లకు విజ్ఞప్తి చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో 10,000 మంది మిలిటెంట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరారని తెలిపారు. ఇప్పుడు వారు తాలుకా, పంచాయతీ, జిల్లా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని వెల్లడించారు. 2,000 మంది నక్సలైట్లు కూడా లొంగిపోయారని తెలిపారు. అయితే, ఇప్పటికీ తమ చేతుల్లో ఆయుధాలు పట్టుకున్నవారితో చర్చలు జరపబోమని తెలిపారు. 2026, మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని ప్రకటించారు. తెలంగాణాలో నక్సలైట్లకు మద్దతు తెలుపుతున్నవారు.. వారి వల్ల ప్రాణాలు కోల్పోయిన గిరిజనులు, పోలీసులు, భద్రతా సిబ్బంది కుటుంబాలకు ఏం సమాధానం చెబుతారని, గిరిజన ప్రాంతాల్లో ఏళ్ల తరబడి అభివృద్ధి నిలిచిపోవడాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణలో పారిపోతున్న నక్సలైట్లకు ప్రతిపక్షం ఆశ్రయం కల్పిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. 2026 మార్చి 31 నాటికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నక్సలిజంను పారదోలుతుందని హామీ ఇచ్చారు.

రైతులు, దళితులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటే దాన్ని మోదీ సారథ్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రమే అందించగలదని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రధానమంత్రి మోదీ విస్తృతస్థాయిలో పనిచేశారని వ్యవసాయ బడ్జెట్‌ను రూ.లక్ష కోట్లకు పెంచారన్నారు. అలాగే రైతుల ఖాతాల్లో నెలకు రూ. 6,000 వేస్తున్నామని, యూరియా, డీఏపీ ధరలు పెరగకుండా నియంత్రిస్తున్నామని తెలియజేశారు. గతంలో లేని విధంగా రైతులకు బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. పసుపు బోర్డు సైతం ఏర్పాటైందన్నారు. దళితులు, వెనకబడిన తరగతులు, గిరిజనులు, పేదలు, యువత, మహిళల సంక్షేమానికి పీఎం మోదీ చేపడుతున్న ప్రయత్నాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని శ్రీ షా తెలిపారు.

# ఆటోని ఢీకొట్టిన ఆర్టీసి బస్సు.. ఇద్దరు మృతి

మెదక్, జూన్ 30:మెదక్ జిల్లా మంబోజిపల్లి శివారులోను నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట నేడు రోడ్డు ప్రమాదం జరిగింది. మెదక్ డిపో ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ వైపు వెళుండగా, కొడిపల్లి నుండి మెదక్ వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్, మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సిది ఉంది.

# పంట పొలాలకు సాగునీరు అందించడమే ధ్యేయం -ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



హైదరాబాద్, జూన్ 30: రైతులందరి పంట పొలాలకు సాగు నీటి అందించడమే తమ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయం ఆవరణలో రూ.35.5 లక్షలతో నిర్మించనున్న నూతన భవనానికి సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా రెండు పంటలకు నీరు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి ఖరీఫ్ కు రబీ పంటలకు సాగునీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ విటల్,డిప్యూటీఈఈ వెంకటేశం, ఎఈఈలు శ్రవణ్ కుమార్,కె.శ్రావణ్ కుమార్, స్థానిక తహసిల్దార్ రాజమోహన్ రెడ్డి,ఎంపీడీవో హుమర్ షరీఫ్, నీటిపారుదల శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ మామిడి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అధ్యక్ష పదవులకు నామినేషన్ వేసిన మాధవ్, రామచంద్రరావు

అమరావతి, జూన్ 30: తెలంగాణ, ఏపిలోని బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవులకు నామినేషన్ ప్రక్రియ నేటి సాయంత్రం ముగిసింది. ఏపి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, తెలంగాణ అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావులు తమ తమ నామినేషన్ లు దాఖలు చేశారు.

ఇక ఏపి అధ్యక్ష పదవి నామినేషన్ వేసిన పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో మంచి పేరుంది. గతంలో ఆయన శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు.

పార్టీ సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహన, వాగ్ధాటి ఉన్న నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పార్టీ పగ్గాలను ఆయనకు అప్పగించాలని అధినాయకత్వం నిర్ణయించి నామినేషన్ వేయించింది.

తెలంగాణలో ఆ పార్టీ సీనియర్ నేత నారపరాజు రామచందర్ రావుకు బిజెపి అధిష్టానం ఈసారి అవకాశం కల్పించింది.. ఎంపీలు డికె అరుణ, అరవింద్, ఈటల లు ఈ పదవి ఆశించినప్పటికీ రామచంద్రరావు విధేయతకు పట్టం కట్టింది.. దీంతో ఇవాళ మధ్యాహ్నం సరిగ్గా 2 గంటలకు రామచందర్ రావు రాష్ట్ర అధ్యక్షుడిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇంకా ఎన్నిక ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. ఏది ఏమైనా.. తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ అధిష్టానానికి పత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చిన్నవాళ్లు, పెద్ద వాళ్లు, నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరినీ కలుపుకుని పని చేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తానని రామచందర్ రావు స్పష్టం చేశారు. కాగా, ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో వారి ఎంపికను అధికారికంగా రేపు ప్రకటించనున్నారు.

# కృష్ణమ్మ పరవళ్లు- నిండుకుండలా శ్రీశైలం జలాశయం

**-రేపు శ్రీశైలం గేట్లు ఎత్తివేసే అవకాశం**
**-జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం**
**-కర్నాటక, మహారాష్ట్రలో కుండపోత వానలు**
**-ఆల్మట్టి నుంచి జూరాలమీదుగా వరదపోటు**
**-ప్రస్తుతం జల విద్యుత్ కోసమే నీటి విడుదల**

అమరావతి, జూన్ 30: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు తరలివస్తోంది. 15 రోజులుగా ఏగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో జలాశయం నిండుకుండలా మారింది. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,56,554 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. ఇంతవరకు అవుట్ ఫ్లో లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు జలాశయం 872.50 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 215.7080 టీఎంసీలుకాగా ప్రస్తుతం 152.4941 టీఎంసీలుగా ఉంది. ఇక కేవలం 12.50 అడుగులు మాత్రమే జలాశయం నిండటానికి తక్కువగా ఉంది. ఈ నీరు జలాశయంలోకి వస్తే నేడో రేపో గేట్లెత్తే అవకాశం ఉన్నట్టు అధికారి వర్గాలు తెలిపాయి.

కర్నాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు..

ఏగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్నాటకలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్రా నది పొంగి పొర్లుతుంది. ఆల్మట్టి డ్యామ్ నుంచి జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద వస్తోంది. ఇక.. శ్రీశైలం జలాశయంలోకి 1,56,554 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులైన జూరాల నుంచి 26,072 క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 1,30,482 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల హంద్రీనీవా నుంచి నీరు విడుదల కాలేదు. ఇంతవరకు విద్యుత్ ఉత్పత్తికి సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ ఉత్పత్తికి 621 క్యూసెక్కుల నీటిని.. తెలంగాణకు 6904 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్టు అధికారులు తెలిపారు..

# సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా ప్రయాస్' మంత్రం.. 'జన్ భాగీధారీ' స్ఫూర్తి మా ప్రయత్నాలన్నింటికీ ప్రేరణ: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 30:న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు జరిగిన ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మహారాజ్ శతజయంతి ఉత్సవాల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక చిరస్మరణీయమైన సందర్భాన్ని నేడు మనమంతా చూస్తున్నాం.. ఇది ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ శతాబ్ది ఉత్సవాల పవిత్రతను స్పష్టం చేస్తోందని వ్యాఖ్యానించారు. పూజ్య ఆచార్య అమర స్ఫూర్తితో నిండిన ఈ కార్యక్రమం అపూర్వమైన స్ఫూర్తిదాయక వాతావరణాన్ని కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి.. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే అవకాశం దక్కడం తనకూ సంతోషం కలిగించిందన్నారు.

ఈ రోజుకు మరో ప్రత్యేక ప్రాముఖ్యం కూడా ఉందన్న ప్రధానమంత్రి.. 1987 జూన్ 28న ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ అధికారికంగా 'ఆచార్య' బిరుదు అందుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఇది కేవలం ఒక బిరుదు మాత్రమే కాదనీ, జైన సంప్రదాయాన్ని ఆలోచన, క్రమశిక్షణ, కరుణతో అనుసంధానించే పవిత్ర ప్రవాహానికి ప్రారంభంగా దీనిని అభివర్ణించారు. దేశం ఆచార్య విద్యానంద్ జీ మునిరాజ్ శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న సందర్భంలో ఈ తేదీ ఆనాటి చరిత్రాత్మక క్షణాన్ని మనకు గుర్తుచేస్తోందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్‌కు నివాళులు అర్పిస్తూ, అందరికీ ఆచార్య ఆశీస్సులు అందాలని శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

"శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ శతజయంతి ఉత్సవాలు సాధారణ కార్యక్రమం కాదు.. ఇవి ఒక యుగపు జ్ఞాపకాలను కలిగి ఉండడమే కాకుండా ఒక గొప్ప రుషి జీవితాన్ని మనకు తెలియజేస్తాయి'' అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఈ చారిత్రాత్మక సందర్భానికి గుర్తుగా ప్రత్యేక స్మారక నాణేలు.. తపాలా బిళ్ళలు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. లక్షలాది మంది అనుచరులకు మార్గదర్శనం చేస్తూ సన్మార్గంలో వారిని నడిపిస్తున్న ఆచార్య శ్రీ ప్రజ్ఞా సాగర్ జీని ప్రత్యేకంగా ప్రశంసించిన శ్రీ నరేంద్ర మోదీ.. ఈ సందర్భంగా ఆయనకు నమస్కరించారు. తనకు లభించిన 'ధర్మ చక్రవర్తి' బిరుదును గురించి ప్రస్తావిస్తూ.. సాధువుల నుంచి స్వీకరించినది ఏదైనా దానిని గొప్ప ఆశీర్వాదంగా భావించాలని భారతీయ సంప్రదాయం మనకు బోధిస్తున్నదని పేర్కొన్నారు. అందుకే ఆ బిరుదును సవినయంగా స్వీకరించి భరతమాత పాదాలకు అంకితం చేశానని తెలిపారు.

యావత్ జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా పనిచేసే బోధనలు చేసిన గొప్ప వ్యక్తితో ఉన్న భావోద్వేగ సంబంధాన్ని ప్రస్తావిస్తూ.. అటువంటి మహనీయుల గురించి మాట్లాడటం సహజంగానే లోతైన భావోద్వేగాలను కలిగిస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ గురించి మాట్లాడే అవకాశానికి బదులు, ఈరోజు కూడా ఆయన మాటలు వినే భాగ్యం మనకు కలిగి ఉంటే బాగుండేదన్నారు. అంత గొప్ప వ్యక్తి జీవిత ప్రయాణాన్ని మాటల్లో చెప్పడం అంత సులభం కాదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 1925 ఏప్రిల్ 22న కర్ణాటక పవిత్ర భూమిలో ఆ మహనీయుడు జన్మించారని తెలిపిన శ్రీ నరేంద్ర మోదీ.. ఆయనకు ఆధ్యాత్మికంగా విద్యానంద్ అనే పేరు వచ్చిందన్నారు. ఆయన జీవితాన్ని జ్ఞానం, ఆనందాల ప్రత్యేక సంగమంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. ఆయన ప్రసంగంలో లోతైన జ్ఞానం ఉంటుందనీ, అయితే ఆ మాటలు చాలా సరళంగా, అందరూ అర్థం చేసుకోగలిగేలా ఉంటాయన్నారు. 150కి పైగా గ్రంథాలు రాస్తూ.. వేల కిలోమీటర్లు నడిచి.. లక్షలాది మంది యువతను క్రమశిక్షణ, సంస్కృతితో అనుసంధానించిన ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ ఒక యుగపురుషులు, దార్శనికులు అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఆయన ఆధ్యాత్మిక ప్రకాశాన్ని నేరుగా అనుభవించే అవకాశం లభించడం తనకు దక్కిన అదృష్టమని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఆయన తనకు మార్గదర్శనం చేసేవారనీ, ఆయన ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ తనపై ఉన్నాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నేడు ఆయన శత జయంతి వేదికపై కూడా ఆయన ప్రేమ, ఆప్యాయతల అనుభూతిని పొందుతున్నానని ప్రధానమంత్రి తెలిపారు.

"ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికతను భారత్ కలిగి ఉంది.. మన దేశం వేల సంవత్సరాలుగా మనుగడ సాగించడానికి కారణం మన ఆలోచనలు, తాత్విక భావన, ప్రపంచ దృక్కోణం శాశ్వతమైనవి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ శాశ్వత దృక్పథం మన రుషులు, మునులు, సాధువులు, ఆచార్యుల జ్ఞానంతోనే ముడిపడి ఉందన్నారు. ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ ఈ శాశ్వత సంప్రదాయానికి ఆధునిక మార్గదర్శిగా నిలిచారని ప్రధానమంత్రి వివరించారు. ఆచార్య అనేక విషయాల్లో లోతైన నైపుణ్యాన్ని కలిగి ఉన్నారనీ, అనేక రంగాల్లో రాణించారని పేర్కొన్నారు. ఆచార్య ఆధ్యాత్మిక శక్తి.. విస్తృత జ్ఞానం.. కన్నడ, మరాఠీ, సంస్కృతం, ప్రాకృతం సహా అనేక భాషలపై ఆయనకు గల పట్టు.. ఆయన పాండిత్యం అసాధారణమని ప్రశంసించారు. సాహిత్యం, ఆధ్యాత్మిక రంగాలకు ఆచార్య చేసిన కృషిని, శాస్త్రీయ సంగీతం పట్ల ఆయన అంకితభావాన్ని, దేశ సేవ పట్ల ఆయన దృఢ నిబద్ధతను ప్రధానంగా ప్రస్తావించారు. జీవితానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ ఆచార్య ఆదర్శప్రాయమైన ప్రమాణాలను నిర్దేశించారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆచార్య విద్యానంద్ జీ గొప్ప సంగీతకారుడు మాత్రమే కాదు, ఒక గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంపూర్ణ నిర్లిప్తత గల దృఢమైన దిగంబర ముని అని పేర్కొన్నారు. ఆయనను జ్ఞాననిధిగా, ఆధ్యాత్మిక ఆనందానికి మూలంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. సురేంద్ర ఉపాధ్యాయ్ నుంచి ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ వరకు సాగిన వారి జీవిత ప్రయాణం ఒక సాధారణ మనిషి నుంచి అతీంద్రియ శక్తిగా పరివర్తన చెందిందని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుత మన జీవిత పరిమితుల ఆధారంగా భవిష్యత్తు ఉండదనీ, మన దిశ.. మన లక్ష్యం.. మన సంకల్పం మన భవిష్యత్తును రూపొందించేందుకు ప్రేరణగా నిలుస్తాయని ప్రధానమంత్రి వివరించారు.

ఆచార్య శ్రీ విద్యానంద్ జీ మునిరాజ్ తన జీవితాన్ని కేవలం ఆధ్యాత్మిక సాధనకే పరిమితం చేయకుండా.. సామాజిక-సాంస్కృతిక పునర్నిర్మాణ మాధ్యమంగా మార్చుకున్నారని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ప్రాకృత భవన్, మరెన్నో పరిశోధనా సంస్థల స్థాపన ద్వారా ఆచార్య భావి తరాలకు విజ్ఞానాన్ని అందించారని ప్రధానమంత్రి తెలిపారు. జైన చరిత్రకూ ఆచార్య ఎంతో గుర్తింపునిచ్చారని ఆయన పేర్కొన్నారు. 'జైన్ దర్శన్'.. 'అనేకాంత్వాద్' వంటి ప్రముఖ గ్రంథాలను రచించిన ఆచార్య తాత్విక ఆలోచనను మరింతగా పెంపొందించారన్నారు. సమగ్రత, అవగాహనల విస్తృతిని ఆయన ఎంతో ప్రోత్సహించారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఆలయ పునరుద్ధరణ నుంచి అణగారిన వర్గాల పిల్లలకు విద్యనందించడం, విస్తృత సామాజిక సంక్షేమం వరకూ ఆచార్య చేసిన ప్రతి ప్రయత్నం స్వీయ-సాక్షాత్కారం, ప్రజా శ్రేయస్సుల సమ్మిళితాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# టీడీపీ విస్తృత భేటీ హైలైట్.. ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు క్లాస్..!

అమరావతి, జూన్ 30: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగు దేశం' కార్యక్రమం అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ఈ విస్తృతస్థాయి భేటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.

సమావేశానికి 15 మంది ఎమ్మెల్యేలు, 56 మంది ఆహ్వానితులు హాజరుకాకపోవడంపై చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "సమావేశాలకే రానివారు ప్రజల కోసం ఏం చేస్తారు? ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు ఉంటుంది," అని హెచ్చరించారు.

"ఉదయం ఎవరు వచ్చారు, సంతకాలు పెట్టి ఎవరు వెళ్లిపోయారు, చివరి వరకూ ఎవరు ఉన్నారు అన్న లెక్కలు అన్నీ నా వద్ద ఉన్నాయి. పని చేయకుండా సలహాలే ఇచ్చేవాళ్లకు భవిష్యత్తు లేదంటూ'' ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేశారు.

## ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు

ఎన్నికలు ఉన్నప్పుడు కాదు.. ఇప్పటినుంచే ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్, క్లీన్ పాలిటిక్స్ చేస్తేనే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తామని స్పష్టం చేశారు.

''ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. చేసిన మేలు ప్రజలకు చెప్పుకోవాలి. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరించాలి," అని చంద్రబాబు గట్టి సందేశం ఇచ్చారు. లోటు బడ్జెట్‌తో ఏర్పడిన కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో నెంబర్ వన్‌గా నిలిపాం. ఏడాది క్రితం విధ్వంస పాలనతో రాష్ట్రం గందరగోళంగా మారింది.

కేంద్ర నిధులు మళ్లించబడ్డాయి. తెలుగు దేశం మాత్రం బాధ్యతగా వ్యవహరించిందన్నారు. "దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లభించని అవకాశాలు తెలుగుదేశానికి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటు విషయంలో కీలక పాత్ర పోషించాం అని గుర్తు చేశారు.

## ఇంటింటి ప్రచారానికి సిద్ధం కావాలి

ఈ సమావేశంలో మేనిఫెస్టో అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. జులై 2 నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభం అవుతుంది. ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ నేతలు సమన్వయంతో ప్రచారం చేయాలి. కూటమి భాగస్వాములందరూ కలిసి పనిచేయాలి సీఎం స్పష్టంగా చెప్పారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆగస్టు 15 నాటికి 700కి పైగా పౌరసేవలు అందుబాటులోకి తెస్తాం. ఇకపై సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

## సంక్షేమం - అభివృద్ధిపై స్పష్టత

భారతదేశంలో అత్యధికంగా పింఛను ఇచ్చేది మనమే. ఒక్కటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ప్రారంభించాం. తల్లికి వందనం వంటి అద్భుతమైన పథకాలు అమలు చేస్తున్నాం. ఇది సూపరిపాలనకు తొలి అడుగని వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శ్రీకారం చుట్టాం. ఈ ఏడాదే అనకాపల్లికి నీళ్లు పంపుతున్నాం.

తర్వాత వంశధారకు అనుసంధానం చేస్తాం అన్నారు. ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్నాం. బీసీలకు రూ.98 వేల వరకు, ఓసీలకు రూ.70 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నాం అని తెలిపారు.

# కారులో మృతదేహాల కలకలం

**-పార్క్ చేసిన కారులో ఇద్దరి యువకుల డెడ్ బాడీలు**
**-బీరుమత్తుతో కారులో ఊపిరి ఆడక మరణం**

తిరుపతి, జూన్ 30: కారులో డెడ్ బాడీలు ఉండటం స్థానికంగా కలకలం రేపాయి. తిరుచానూరు రంగనాథం వీధిలో ఓ కారులో ఇద్దరు యువకుల మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కారులో బీర్లు తాగి మత్తులో అలానే నిద్రించడంతో ఊపిరి ఆడక మృతి చెందారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కారులో నాలుగు బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. మరణించిన వారు వినయ్, దిలీప్ లుగా గుర్తించారు. ఇద్దరు యువకుల మృతదేహాలను కారు నుంచి బయట తీశారు పోలీసులు. పోస్ట్ మార్టమ్ నిమిత్తం హాస్పిటల్ కు తరలించారు. ఎస్సై సాయి నాథ్ చౌదరీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పాశమైలారం ప్రమాదం దురదృష్టకరం -పవన్ కల్యాణ్

అమరావతి, జూన్ 30: తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో చోటు చేసుకున్న ప్రమాదంలో 8 మంది కార్మికులు దుర్మరణం పాలవడం పట్ల ఏపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడం మూలంగా చోటు చేసుకున్న ఈ పరిశ్రమలో గాయపడ్డవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారికి, ఇతర క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


# "వైద్యో నారాయణ హరి"

**జూలై 1న, జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా**



## ప్రస్తావన:

వైద్యో నారాయణ హరి అంటే వైద్యులు దేవుళ్ళతో సమానం. ఇది అక్షర సత్యం. అందరికీ ఆరోగ్యం ముఖ్యం. అనారోగ్యం పాలైన వారిని ఆరోగ్యం వంతులుగా మార్చడం వైద్యుల విధి. ఎంతటి భయంకరమైన వ్యాధుల్లో నుంచైనా



సాధ్యమైనంత శ్రమించి ప్రాణాలు కాపాడతారు. అత్యంత ప్రమాద స్థితిలో ఉన్నవారినైనా మరణానికి చేరువైన వారిని తిరిగి ఆరోగ్యవంతులుగా చేస్తారు వైద్యులు. వైద్య వృత్తిలో ఉన్నవారు యముడితో సైతం పోరాటం చేసి రోగిని ఆరోగ్యవంతులుగా చేస్తారని ప్రతీతి. అలాంటి వైద్యులు నిజంగా ఆ దేవుడితోనే సమానం. జాతీమ వైద్యుల దినోత్సవం సందర్భంగా కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం...


గడచిన కాలం కరోనా భూతం (కోవిడ్-19) జనంపై విరుచుకుపడి యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసి వేలు, లక్షల ప్రజల ప్రాణాలను హరించివేసిన వైనం. గుర్తుకువస్తే భయం... భయం... నేటికీ ఎక్కడ ఒకచోట ఏదో ఒక రూపంలో కరోనా భూతం వెంటాడుతూనే ఉంది. ఇంతటి భయానక వాతావరణాన్ని తరిమి తరిమి కొట్టిన పోరాట యోధులు, ప్రాణదాతలు ఎవరు? ఇంకెవరు? "డాక్టర్లు" వారే ఏ విభాగానికి చెందిన వారైనప్పటికీ, ఆ సమయంలో కుటుంబాన్ని వదిలి ప్రాణాలను సైతం పణంగా పెట్టి, పగలనక, రాత్రనక ఆహర్నిశలు యమునితో పోరాటం చేసి ప్రజల ప్రాణాలను నిలబెట్టిన ఘనులు డాక్టర్లు. భారతదేశానికి చెందిన డాక్టర్లు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలందించిన అత్యవసర అధికారాలు, విధులు నేపధ్యం, ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశం డాక్టర్లు మరణాల రేటుని తగ్గించగలి గారన్నది జగమేరిగిన సత్యం. ఈ విధంగా నిరంతరం డాక్టర్లు కొనసాగిస్తున్న వృత్తి సేవాతత్పరతకు అక్కడక్కడ కొన్ని సందర్భాల్లో అపశృతులున్నప్పటికీ పోరాటయోధులు, ప్రాణదాతలు డాక్టర్లే. ఈ సందర్భంగా చరిత్రలోకి వెళితే....

## చరిత్ర:

భారతదేశం జాతీయ వైద్యుల దినోత్సవం జూలై 1న, ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ రెండొవ ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జన్మదినమును గుర్తుచేసు కుంటూ ప్రతియేట సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు విధులు నిర్వహించిన వీరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ & మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటులో కీలకపాత్ర పోషించడం గమనార్హం. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్యులుగానే కాకుండా విద్యావేత్త, పరోపకారి, సామాజిక కార్యకర్త కావడం, ఇంకా వారు వైద్య సేవను ఆదర్శవంతంగా తీసుకోవడానికి కారణం, డాక్టర్లు ఒత్తిడితో కూడిన సేవా జీవితానికి తమ జీవితాలను అంకితం చేసిన లక్షలాది మంది వైద్యులకు ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ, డాక్టర్లు గౌరవప్రదంగా, దయతో ఉండాలనీ అంటుండేవారు. బ్రిటిష్ మెడికల్ జర్నల్ డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ సంస్మరణలో వారి గురించి 'భారత్ ఉపఖండంలో మొదటి వైద్య సలహాదారు, అనేక రంగాలలో వీరు తన సమకాలీనులను అధిగమించారనీ పేర్కొనడం గమనార్హం. డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వృత్తిపరంగా అత్యున్నత స్థితిలో ప్రపంచంలోనే అతి పెద్ద కన్సల్టింగ్ ప్రాక్టీస్‌ని కలిగివున్నట్లు, నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించడంలో ఘనులు. పేద ప్రజలకు అందుబాటులో ఉండేవారట. దేశంలో రెండు ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల ఏర్పాటుకు కీలక పాత్రను పోషించారు. 1928లో ఇండియన్ మెడికల్ అసోషియేషన్, 1939 & 1945 మధ్యలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మొదటి అధ్యక్షుడిగా ఉన్నారు. ఇంకా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, ఇన్ఫెక్షియస్ డిసీత్ హాస్పిటల్ కలకత్తాలో మొట్టమొదటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కాలేజీని స్థాపించ డానికి తోడ్పడ్డారు. డాక్టర్ వృత్తికి వన్నె తెచ్చిన వీరి ఘనకీర్తిని కొనియాడుతూ, ఇంకా డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ స్వాతంత్ర్య సమరయోధులు కూడా, డాక్టరుగా వైద్యవృత్తికి వీరు తెచ్చిన కీర్తి ప్రతిష్టలను, సేవాభావాన్ని గుర్తించిన భారతదేశం జూలై 1వ తేదిని ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే - జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకోవడం పరిపాటి. డాక్టర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారందరికీ డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ మార్గదర్శకులు. డాక్టర్ వృత్తిపట్ల ఉండాల్సిన అంకిత భావాన్ని భవిష్యత్ తరాల డాక్టర్లం దరికీ వృత్తి ధర్మంకి, ఉన్నతవిలు వలను తెలియపరిచే విధంగా ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

### డాక్టర్స్ డే వేడుకలు :

డాక్టర్ బిధాన్ చంద్రరాయ్, డాక్టర్ వృత్తి పట్ల ఉండాల్సిన అంకిత భావం, భవిష్యత్ తరాల డాక్టర్లందరికీ స్ఫూర్తివంతం కావడానికి 1982 జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినోత్సవ (డాక్టర్స్‌డే) ఉత్సవాలు జరుపుకుంటూ వైద్యవృత్తికి సేవా భావంతో విధులను నిర్వర్తించిన డాక్టర్లను సన్మానించుకుంటూ, ఇతర డాక్టర్లకు స్ఫూర్తి కలిగిస్తూండటం గమనార్హం. వైద్యవృత్తికి మార్గదర్శకులైన డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ 1982 జూలై 1వ తేదీనే





మరణించడం విశేషంగా పేర్కొనవచ్చు. కనుక ఈ తేదీని జాతీయ వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) సందర్భంగా వైద్య వృత్తికి అంకితమైన డాక్టర్లందరికీ వందనాలు-హరి చందనాలు.

సర్వేజనాః సుఖినోభవంతు.



-శారద శృంగేరి
విశ్రాంత విభాగాధికారి
ఆంధ్రప్రదేశ్ సచివాలయం
9490261119





## వైద్యో నారాయణో హరిః !

శ్వేత వర్ణ కోటు ధరించి..
తేట తెల్లని మనస్సులతో..
మెడలో స్టెతస్కోప్ మాలతో..
లబ్ డబ్‌లతో రోగాల్ని గుర్తించి..
అమృత స్పర్శతో ప్రేమలు పంచి..
మాటల్నే ఔషధాలుగా చేసుకొని..
చిరునవ్వుతో ఆత్మవిశ్వాసం నింపి..
రోగాన్ని తరిమి ఆనందాన్ని ఇచ్చి..
పౌర శ్రేయస్సే తన లక్ష్యమని తలచి..
శారీరక, మానసిక, భావోద్వేగాల..
చికిత్సలతో లోక కల్యాణం చేసి..
ఆయురారోగ్యాలను అందించే..
అలుపెరుగని ఆరోగ్య ప్రదాతలు
విరామమెరుగని వైద్యులు
రోగుల పాలిటి ప్రాణదాతలు
పునర్జన్మనిచ్చే దేవ దూతలు
నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యాలు
రోగులే తమ కుటుంబ సభ్యులు
వ్యాధులను మట్టుబెట్టే శక్తులు
కళ్ల ముందు కదలాడే సేవకులు
వైద్యో నారాయనో హరిః !

-మధుపాళీ
9949700037

# పంచాయతీ కో ఆప్షన్ మెంబర్ గా టాస్కా సభ్యుడిని తీసుకోవాలి

**-కాచారం సమావేశం లో ప్రభుత్వాన్ని కోరిన జిల్లా టాస్కా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం**

**- స్థానిక యాదగిరిగుట్ట దేవస్థానం లో వృద్ధులకు ఉచిత దర్శనం కల్పించాలని మండల అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య డిమాండ్**



యాదగిరిగుట్ట, జూన్ 30 జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);: వయోజనులకు అండగా టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) నిలబడుతుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతుం దని యాదాద్రి భువనగిరి జిల్లా టాస్కా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట్ల వెంకటేశం పునరుద్ఘాటించారు. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మండల టాస్కా అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత మండల టాస్కా ప్రధాన కార్యదర్శి పులుగం చక్రపాణి గ్రామ వయోజనులకు స్వాగతం పలికారు. చట్టం ద్వారా వయోజనులకు చేకూరి న రక్షణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రయోజనాలు తదితర అనేక అంశాలపై ఎర్రగుంట్ల వెంకటేశం సుదీర్ఘంగా ప్రసంగించారు. వృద్ధాప్యం లో ఒంటరి తనానికి లోనుకావద్దని, గ్రామం లో వయోజనులు సంఘటితంగా వుంటే సమస్యలు సులువుగా పరిష్కారం అవుతాయన్నారు. ఉన్న ఆస్తులు పిల్లల పేరు మీద రాసేసి తర్వాత ఇబ్బందులకు గురి కావద్దని, చరమాంకంలో వీలునామా రాసి జాగ్రత్తలు పడవచ్చునని ఆయన సూచించారు. జిల్లాలో 425 కేసులలో వయోజనులకు టాస్కా అండగా నిలిచి ఎలా న్యాయం కోసం పోరాడిందో అనేక సంఘటనలను ఆయన వివరించారు. ప్రతి పంచాయతీ పాలక వర్గంలో కో ఆప్షన్ సభ్యుడుగా టాస్కా సభ్యుడిని తీసుకోవాలని, తద్వారా గ్రామ వయోజనులకు స్థానికంగా సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాలతో టాస్కా కు ఎలాంటి సంబంధం లేదని, ఇది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని ఆయన స్పష్టం చేశారు. మండల టాస్కా అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య మాట్లాడుతూ రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న వయోజనుల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాలని కోరారు. వృద్ధులకు ప్రత్యేకంగా ఆశ్రమాలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని, స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయంలో ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ఒకగంట చొప్పున వృద్ధులకు ఉచిత దర్శనం కల్పించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా దాదాపు వందమందికి పైగా పాల్గొన్న వయోజనులు ఒకటిరెండు రోజుల్లో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసుకుంటామని ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా టాస్కా సంయుక్త కార్యదర్శి బండారు బిక్షపతి, భువనగిరి మండల అధ్యక్షుడు పి రోమన్ తోపాటు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రాగి సహదేవ్, మండల కమిటీ నాయకులు నూకల సుధాకర్ రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, గౌడ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శమైన గురుకులాలు రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల నిర్వీర్యం

**- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ**

హైదరాబాద్ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శమైన గురుకులాలు, రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యం వల్ల నిర్వీర్యం అవుతుండటం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. విద్యావ్యవస్థ పట్ల కాంగ్రెస్ చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆరోపించారు. రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతు ఒడటం శోచనీయమని వెల్లడించారు. జనవరి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోడిగుడ్లు, మాంసం, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయాయని చెప్పారు. బకాయిలు చెల్లించకుంటే జులై 1 నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామాగ్రి సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. మరోవైపు 13 నెలలుగా రూ.450 కోట్లకుపైగా అద్దె బకాయిలు చెల్లించక భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దుస్థితి నెలకొన్నదని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో యూనిఫామ్ ఇవ్వకపోవడంతో పిల్లలు పాత, చినిగిపోయిన దుస్తులు వేసుకుంటున్నారని తెలిపారు. పదేండ్లలో అద్భుతంగా నడిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ పాలనలో కుదేలవుతుండటం దురదృష్టకరమన్నారు. దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని నిలబెట్టాలని, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద పిల్లల భవిష్యత్తును కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు. ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగులు.. తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

# ఎంత పని చేశామనేది కాదు..ఎలా చేస్తున్నామనేది కూడా కీలకం: చంద్రబాబు

అమరావతి జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొందరు ఎంతో పని చేస్తారు కానీ మంచి పేరు రాదని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎంత పని చేశామనే అంశంతో పాటు ఎలా చేస్తున్నామనేది కూడా కీలకం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొందరు పెద్దగా పని చేయకున్నాప్రజల్లో మంచి పేరు ఉంటుందని చెప్పారు. ఇప్పుడు గెలిచిన వాళ్లు మళ్లీ మళ్లీ గెలవాలి అని ఆ దిశగా ఆలోచన చేస్తున్నానని, పార్టీలో ప్రతి ఒక్కరూ అదే తరహాలో ఆలోచన చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులకు వారసత్వం ఉందని తాము పని చేయమంటే వారికి ఓ నమస్కారం పెడతానని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు నేతల పనితీరుపై సమాచారం తెప్పించుకుంటున్నానని, అనేక మార్గాల ద్వారా సర్వేలు చేయిస్తున్నానని తెలియజేశారు. అన్నీ సర్వేలను విశ్లేషించి వాస్తవాలను బేరీజు వేస్తున్నానని, ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. తాను చెప్పాల్సింది ఎమ్మెల్యేలకు చెబుతున్నానని, మారాల్సింది ఎమ్మెల్యేల పనితీరు అని సలహాలు ఇచ్చారు. పనితీరు మార్చుకుంటే బాగుంటుందని, లేకపోతే ఇక అంతే సంగతులు అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# మణిపూర్‌లో కారుపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు నలుగురు మృతి

మణిపూర్ జూన్ 30 (ఎక్స్ ప్ళిరేన్స్ న్యూ న్);మణిపూర్ చురాచాంద్ జిల్లా మాంగ్‌జంగ్ గ్రామంలో సోమవారం గుర్తు తెలియని దుండగులు కారుపై కాల్పులు జరపడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో జరిగిందని పోలీసులు చెప్పారు. చురాచాంద్‌పూర్ పట్టణానికి ఏడు కిమీ దూరంలో మాంగ్‌జంగ్ గ్రామం ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం దుండగులు పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. మృతులు థెంఖోథాంగ్ హావోకిప్ అలియాస్ థాపి (48), సెయిఖోగిన్ (34)లెంగౌహావో (35), ఫల్‌హింగ్ (72) గా గుర్తించారు. సంఘటన ప్రదేశం నుంచి 12 ఖాళీ తూటాలను సేకరించారు. ఈ దాడికి బాధ్యులమ 12 ష్ఠంటూ ఇంతవరకు ఎవరూ వెల్లడించలేదు. పోలీసులు, అదనపు భద్రతా బలగాలు ఆ ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టాయి.

మణిపూర్ జూన్ 30 (ఎక్స్ ప్ళిరేన్స్ న్యూ స్);మణిపూర్ చురాచాంద్ జిల్లా మాంగ్‌జంగ్ గ్రామంలో సోమవారం గుర్తు తెలియని దుండగులు కారుపై కాల్పులు జరపడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో జరిగిందని పోలీసులు చెప్పారు. చురాచాంద్‌పూర్ పట్టణానికి ఏడు కిమీ దూరంలో మాంగ్‌జంగ్ గ్రామం ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం దుండగులు పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. మృతులు థెంఖోథాంగ్ హావోకిప్ అలియాస్ థాపి (48), సెయిఖోగిన్ (34)లెంగౌహావో (35), ఫల్‌హింగ్ (72) గా గుర్తించారు. సంఘటన ప్రదేశం నుంచి 12 ఖాళీ తూటాలను సేకరించారు. ఈ దాడికి బాధ్యులమంటూ ఇంతవరకు ఎవరూ వెల్లడించలేదు. పోలీసులు, అదనపు భద్రతా బలగాలు ఆ ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టాయి.

# షరతులకు రెండు దేశాలూ ఓకే..

**-జులై 8 నాటికి భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ప్రకటన..!**



న్యూ డిల్లీ జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని జులై 8 నాటికి ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒప్పందానికి సంబంధించిన అన్ని నిబంధనలను ఇరుపక్షాలూ అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అన్ని దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అదనపు సుంకాలకు గడువు జులై 8 వరకూ నిర్ణయించారు. అంతలోపు ఆయా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే, జులై 9 నుంచి అదనపు సుంకాలు వడ్డిస్తారు. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, అదనపు సుంకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని భారత్ గత కొంతకాలంగా అగ్రరాజ్యాన్ని కోరుతోంది. అదే సమయంలో కొన్నింటిపై సుంకాల భారాన్ని తగ్గించాలని అమెరికా కూడా భారత్‌కు విజ్ఞప్తి చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవలే కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. రెండు దేశాలు పరస్పరం లాభదాయకమైన వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపారు. ఈ చర్చలు తాజాగా ఓ కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఇప్పటికే చైనాతో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలే ప్రకటించారు. దీనిని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, తాను ఆమోదించవలసి ఉందని ట్రూత్ సోషల్ పోస్ట్‌లో తెలిపారు. ఇరు దేశాల ప్రతినిధులు లండన్‌లో రెండు రోజులపాటు జరిపిన చర్చలు ముగిసిన అనంతరం ఆయన ఈ పోస్ట్ చేశారు. ఫుల్ మేగ్నెట్స్, అవసరమైన రేర్ ఎర్త్ మినరల్స్‌ను చైనా ఎగుమతి చేస్తుందని చెప్పారు. చైనా విద్యార్థులు అమెరికాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదువుకోవచ్చునని, అది తనకు సంతోషకరమని తెలిపారు. కాగా, భారత ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 10 శాతం టారిఫ్ విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే, అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ భారత్ సహా పలు దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. ఏప్రిల్ 2న మన దేశంపై ట్రంప్ 26 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అదనపు సుంకాలను జులై 9 వరకూ నిలిపివేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం గతంలోనే ప్రకటించింది. ఈ అదనపు 26 శాతం సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని భారత్ కోరుతోంది.

# గుట్ట అన్నదాన పథకానికి 25 లక్షల విరాళం

యాదగిరిగుట్ట, జూన్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానం శాశ్వత నిత్య అన్నదాన పథకానికి భారీ స్పందన లభిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా తీర్చిదిద్దేందుకు కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు చేస్తున్న కృషికి మంచి స్పందన లభిస్తోంది. హైద్రాబాద్ కొండాపూర్ కు చెందిన భూపతిరాజు సూర్యనారాయణరాజు వారి మనవడు అనంత్ ఇషాన్ పేరున శ్రీ స్వామి వారి శాశ్వత నిత్య అన్నదాన పథకానికి 25 లక్షల రూపాయల విరాళం చెక్కును కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు కు అందజేశారు. విరాళాల దాతలను ప్రోత్సహించేందుకు దేవస్థానం ప్రత్యేక పథకాలు రూపొందించాలని, తద్వారా భక్తులకు మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయని, దేవస్థానం త్వరితగతిన మరింత అభివృద్ధి చెందుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

# వేధింపులు తాళలేక ఎస్ఐ భార్య ఆత్మహత్య

ఖమ్మం, జూన్ 30:ఖమ్మం రైల్వే ఎస్ఐ భార్య ఆత్మహత్య చేసుకుంది. భర్త, అత్తారింటి వేధింపులే ఇందుకు కారణంగా సమాచారం. జూలూరుపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన రాజేశ్వరి (34)ని ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని రాములుతండాకు చెందిన బానోతు రాణా ప్రతాప్ కు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.40 లక్షల నగదుతో పాటు 35 తులాల బంగారం, మరో రూ.4 లక్షల విలువ చేసే వస్తువులను కట్నంగా ఇచ్చారు.

వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలం తర్వాత రాజేశ్వరి భర్త రానా ప్రతాప్, అత్త పుష్పరాణి, మామ చంద్రం, బావ ఎస్ఐ మహేశ్ కలిసి ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించేవారు. తాము చెప్పిన విధంగా నడుచుకోవాలని, అక్రమ సంబంధాలు అంటకట్టడం, తాము చెప్పిన ఇంట్లోనే ఉండాలంటూ, లేకుంటే ఆత్మహత్య చేసుకోవాలని మానసికంగా ఒత్తిడి చేసేవారు.

రాణా ప్రతాప్ జూలూరుపాడు ఎస్ఐగా పనిచేసిన సమయం నుండి భార్య రాజేశ్వరి జూలూరుపాడు లోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటుంది. ఈ క్రమంలో రాజేశ్వరిని గత



కొంతకాలంగా తీవ్రస్థాయిలో మానసికంగా వేధిస్తుండడంతో ఒత్తిడి తట్టుకోలేక ఈ నెల 25న రాత్రి గడ్డి మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 29 రాత్రి మృతి చెందింది. తన కుమార్తె రాజేశ్వరిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన భర్త రాణా ప్రతాప్, అత్త పుష్పావతి, మామ చంద్రం, బావ మహేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి కె.లోతు సోమ్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.